



# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

అన్నమయ్య

పేజీలు 8

ఆదివారం | 27 జులై 2025





## అసాంఘిక కార్యక్రమాలకు నెలవుగా ప్రభుత్వాసుపత్రి


- ఆస్పత్రి ఆవరణలో భారీగా మద్యం సేవిస్తున్న యువత
- మద్యం మత్తులో పరస్పరం గొడవలు
- చోద్యం చూస్తున్న సెక్యూరిటీ
- భయభ్రాంతులకు గురవుతున్న రోగులు

**మదనపల్లె టౌన్, మేజర్ న్యూస్:** మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో ఇటీవల ప్రజలకు వైద్య చికిత్సలు కొరవడంతో పాటు అసాంఘిక కార్యక్రమాలకు ప్రభుత్వ ఆసుపత్రి అడ్డగా మారింది. ఎక్కువగా ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్లు రాత్రింబవళ్లు ఆస్పత్రిలోనే మకాం వేస్తూ జోరుగా మద్యం సేవిస్తున్నారు. ఆసుపత్రి ఆవరణలోనే మద్యం సేవిస్తూ బీరు, మద్యం సీసాలు పడేస్తూ మత్తులో ఘర్షణలకు దిగుతున్నారు. ఆసుపత్రిలో పెద్ద ఎత్తున సెక్యూరిటీ ఉన్నా, అవుట్ పోస్ట్ పోలీసులు ఉన్నా వీటిని నియంత్రించడంలో ఘోరంగా వైఫల్యం చెందుతున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం అర్ధరాత్రి రెండు వర్గాలు బాహాబాహీకి దిగి భారీగా కొట్టుకున్నారు. దీంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు, వారి అటెండర్లు తీవ్రఆందోళన చెందుతున్నారు. మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి పట్టణంతో పాటు పరిసర గ్రామ ప్రాంతాల ప్రజలు, తంబళ్లపల్లె, పుంగనూరు, పీలేరు నియోజకవర్గ ప్రజలతో పాటు కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా అధిక సంఖ్యలో రోగులు వస్తుంటారు. ఇక్కడ 24 గంటల అత్యవసర విభాగం నడుస్తోంది. పెద్దాసుపత్రి కావడంతో ప్రమాదాల్లో గాయపడిన వారిని, ఘర్షణలో గాయపడిన వారిని, ఆత్మహత్యాయత్నాలకు పాల్పడిన వారిని, దాడుల్లో గాయపడిన వారిని, ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని ఇక్కడికి తెస్తుంటారు. ఈ సమయంలో అత్యవసర వైద్య చికిత్సలు మిగతా 2లో

వారానికోసారి సోది చెబుతాం

## సోది చెబుతామమ్మ సోది చెబుతాం...

- ఉన్నది లేనట్లు లేనిది ఉన్నట్లు నమ్మించే ప్రయత్నం చేస్తాం,,,
- బాబోయ్ పులి కథలు ఎన్ని రోజులు వింటారు,,,
- పనిచేయడం తక్కువ ప్రచారాలు ఎక్కువ,,,
- తీరు మారని నాయకులు,,,
- పార్టీ బలోపేతానికంటే బజారుకీర్చడమే లక్ష్యం,,,




గతంలో సోది చెబుతామమ్మ సోది చెబుతాం అని వీధుల్లో చాలామంది తిరిగేవారు. అప్పుడు వారు చెప్పేది ఉన్నది ఉన్నట్టు చెబుతాం లేనిది లేనిది చెబుతామని అంటూ చేయి చూసి వారికి తోచింది తెలిసింది చెప్పేవారు. అయితే అప్పట్లో అది కొంతమంది నమ్మితే మరి కొంతమంది నమ్మేవారు కాదు. ప్రస్తుతం ఆ కలను కొందరు నాయకులు పునికి పుచ్చుకొని నెలకి మూడు నాలుగు సార్లు సోది చెప్పడమే పనిగా పెట్టుకుని రాజకీయ సోదరులు చెబుతూ ముందుకు వెళ్తున్నారు. ఈ విషయంలో అన్నమయ్య జిల్లాలోని కొందరు నాయకులు మాత్రం సోది చెప్పే వాళ్ళ కంటే మరింత ఎక్కువ సోది చెబుతూ ప్రజలను కూడా పెడుతూ విచిత్ర రాజకీయాలు చేస్తున్నారు.

**అన్నమయ్య జిల్లా బ్యూరో, మేజర్ న్యూస్:** చెప్పిందే చెబుతూ ప్రజలను నమ్మించేందుకు నానా తండాలు పడుతున్నారు టిడిపిలోని కొందరు వ్యక్తులు. అది ఎంతలా అంటే సోది చెప్పే వాళ్ళు కూడా ఉన్నది ఉన్నట్లు చెబుతాం,లేనిది లేనట్లు చెబుతాం అని చెప్తుంటే ఇక్కడ మాత్రం ఈ రాజకీయ సోది మాత్రం లేనిది ఉన్నట్లు చెబుతూ ఉన్నది లేనట్లు చెబుతూ అటు కార్యకర్తలను ఇటు ప్రజలను తికమక పెట్టడమే లక్ష్యంగా పనిచేస్తున్నారు. అయితే ఇలాంటి వారికి పార్టీ ప్రయోజనాల కంటే వ్యక్తిగత ప్రయోజనాలే ముఖ్యంగా కనిపిస్తున్నాయి. ఎందుకంటే అన్నమయ్య జిల్లాలో చాలామంది టిడిపి నాయకులు పార్టీ బతకకపోయినా ఇబ్బంది లేదు తమకు నచ్చని వారిని ఏదో ఒక విధంగా ఇబ్బందులు పాలు చేయాలి లేదా వారిపై అసత్య ప్రచారాన్ని చేయాలని నెలలో కనీసం నాలుగు మిగతా 2లో

## మెరుగైన సదుపాయాలు కల్పించడమే లక్ష్యం

-ప్రతి ఒక్కరు అభివృద్ధి చెందాలి,,

-సిమెంట్ రహదారుల నిర్మాణానికి భూమి పూజ చేసిన రాజంపేట పార్లమెంట్ ఇంచార్జ్ చమర్తి

-సుపరిపాలన తొలి అడుగు లో ఇంటింటి ప్రచారం

**రాజంపేట,మేజర్ న్యూస్** రాజంపేట పట్టణంలో మెరుగైన సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని, ఎక్కడ సమస్య ఉన్న వెంటనే పరిష్కరించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని రాజంపేట పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు చమతి జగన్మోహన్ రాజు తెలియజేశారు. శనివారం రాజంపేట పట్టణం మునిసిపాలిటీ పరిధిలోని 6వ వార్డు నందు గాంధీ నగర్‌లో 12 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి రాజంపేట పార్లమెంటు ఇంచార్జ్ చమర్తి జగన్మోహన్‌రాజు భూమిపూజ చేశారు. అనంతరం చమర్తి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రాజంపేట నియోజకవర్గంలో మిగతా 2లో



## పశువుల జాతిని కాపాడడమే జీవితాశయం

-గోశాల ఏర్పాటు. -నాలుగు వందల పైగా అవులకు ఆశ్రయం.

-కరువులోనూ పశు గ్రాసం కొరత లేదు.

-కూలీలకు సైతం జీవనోపాధి.

**తంబళ్లపల్లి, మేజర్ న్యూస్:** తమిళనాడు కు చెందిన ఎల్ జయరామన్ ఉద్యోగరిత్య హైదరాబాద్ లో స్థిరపడి మన దేశీయ పశువులను బతికించడం కోసం ప్రకృతి వ్యవసాయ ఫలాలను స్థానిక రైతులకు అందించడానికి ముందుకు వచ్చాడు.ఈ బృహత్ కార్యక్రమాన్ని 2016 జయరామన్ శ్రీకారం చుట్టాడు, తంబల్లపల్లి మండలం మర్రిమాకులపల్లి, కన్నేమడుగు పంచాయతీ గోళ్ళపల్లివారిపల్లి సమీపంలోని శ్రీకనికలమ్మ సమీపంలో 50 ఎకరాలు సొంత నిధులతో కొనుగోలు చేసిన మెట్ట మొదట ప్రథమంగా మూడు దేశీయ గోమాత లతో గోశాలను ప్రారంభిచాడు,అప్పటి నుండి ఎక్కడ ఆవులను అమ్మకానికి వచ్చిన వెంటనే కొనుగోలు చేసి సురక్షితంగా గోశాలకు తరలించి దినదిన అభివృద్ధి చేసి నేడు 430 అవులకు పైగా గోశాలలో కలకలాడుతున్నాయి,గోవుల సంరక్షణ కోసం రోజు 50 మంది కూలీలకు ఉపాధి కలిపిస్తూ తన మానవత్వం చాటుకుంటున్నారు, జయరామన్ ఉద్యోగరీత్యా హైదరాబాద్‌కు వెళ్ళి వస్తూండడంతో గోవుల సంరక్షణ భాద్యత తమిళనాడు కు



చెందిన యం. రామ్మూర్తిని మేనేజర్‌గా నియమించారు, జయరామన్ ఆశయసాధనకు అనుగుణంగా గోమాతలకు సేవచేసి గోశాలకు తన వంతు సహకారం అందిస్తూ వస్తూన్నాడు,గోశాల భూమిలో 4 బోర్లు వేసి పశుగ్రాసం కొరత లేకుండా చుస్తూన్నారు,గోశాల లో పశువులకు 12 విశాలమైన షెడ్లు తో బాటు లేగా దూడలకు ప్రత్యేక మైన షెడ్లు నిర్మిచారు,పాడి ఆవుల పాలు పితకాకుండా పూర్తిగా లేగాదూడలకే వదిలేయడం విశేషం,ఈ గోశాలలో పలు ప్రాంతాల పశువుల ఉండగా అందులో ఒంగోలు, నెల్లూరు, పుంగనూరు,హెూళిగర్ పశువులతో బాటు స్థానిక నాటి పశువుల జాతీ ఉన్నాయి. మిగతా 2లో

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం



బి.కొత్తకోట,మేజర్ న్యూస్ : తంబళ్లపల్లె నియోజకవర్గం, బి.కొత్తకోట మండలం తుమ్మనగుట్ట టోల్గేట్ సమీపంలోని జాతీయ రహదారి 42పై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు.గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ద్విచక్ర వాహనంలో వెళ్తున్న ఇరువురు ప్రమాద స్థలంలోని మృతి చెందారు.కుప్పం మండలం అనిమిగానిపల్లెకు చెందిన లోకేష్ (20) కాకిమడుగు గ్రామానికి చెందిన వెంకటేష్ (35)లుగా గుర్తించారు.వీరిద్దరూ మదనపల్లెలోని ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో ఉద్యోగరీత్యా బురకాయలకోటకు కలెక్షన్లకు వెళ్లి తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో ప్రమాదానికి గురయ్యారు.పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు.ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జీవన్ గంగానాథ్ బాబు పేర్కొన్నారు.

## నగర పంచాయతీ కార్యాలయంలో దేశు లక్ష్మయ్యశెట్టి చిత్రపటం ఏర్పాటు

### - బి.కొత్తకోట ప్రజలు హర్షం



బి.కొత్తకోట,మేజర్ న్యూస్: తంబళ్లపల్లి నియోజకవర్గం,బి.కొత్తకోట పంచాయతీకి స్థలాన్ని విరాళంగా ఇచ్చిన దాత దేశు లక్ష్మయ్యశెట్టి చిత్రపటాన్ని నగర పంచాయతీ కార్యాలయం నందు అధికారులు ఏర్పాటు చేశారు.1950లో స్థానికుడ్కెన దేశు లక్ష్మయ్యశెట్టి బ్కెపాస్ రోడ్డు పంచాయతీ వీధిలో రోడ్డుపైనే 35 సెంట్ల భూమిని విరాళంగా ఇచ్చారు.ప్రస్తుతం కోట్లు పలికే ఈ భూమిని స్వీకరించిన అప్పటి పంచాయతీ పాలకవర్గం పంచాయతీ భవనాన్ని నిర్మించింది.1954 మే 5న అప్పటి తంబళ్లపల్లె ఎమ్మెల్యే టీ.ఎన్.వెంకటసుబ్బారెడ్డి భవనాన్ని ప్రారంభించారు.అప్పటి పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎంఏ.రవూఫ్,సర్పంచు సి.కోదండరామారావు,భూ విరాళ దాత దేశు లక్ష్మయ్యశెట్టి పాల్గొన్నారు.అప్పుడు వేలల్లో విలువచేసే స్థలాన్ని విరాళంగా ఇచ్చిన దాతకు గౌరవిస్తూ దేశు లక్ష్మయ్యశెట్టి ఫోటో పెట్టేందుకు అప్పట్లో తీర్మానం చేశారు.పంచాయతీ గా ఉన్న రోజులు ఫోటో పెట్టారు నగర పంచాయతీగా మారినప్పుడు నుండి ఇన్ని రోజులైనా స్థలాన్ని విరాళంగా ఇచ్చిన వ్యక్తి చిత్రపటం ఏర్పాటు చేయకపోవడంపై పట్టణ ప్రజలు,ప్రముఖులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.ఇదే విషయం పలు దినపత్రికలలో సైతం ప్రచురితమైంది.దీంతో ఎట్టకేలకు నగర పంచాయతీ అధికారులు దేశు లక్ష్మయ్యశెట్టి చిత్రపటం ఏర్పాటు చేయడంతో పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## అసాంఘిక కార్యక్రమాలకు నెలవుగా ప్రభుత్వాసుపత్రి



(మొదటి పేజీ తరువాయి) అందించినా పరిస్థితి విషమంగా ఉన్నవారిని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు రెఫర్ లు చేస్తుంటారు. ఈ క్రమంలో వారిని తరలించే అంబులెన్స్ డ్రైవర్లు ఇక్కడే రాత్రింబవళ్లు మఖాం వేసి మద్యం సేవిస్తూ బాడుగలు తోలుకునే క్రమంలో పరస్పర ఘర్షణలకు దిగుతున్నారు. అంతేకాకుండా దాడులకు తెగబడుతున్నారు. ఈ క్రమంలోనే శుక్రవారం రాత్రి ఓ వర్గానికి చెందినవారు ఆసుపత్రి ఆవరణలోని అతిగా మద్యం సేవించి, మరో వర్గానికి చెందిన వారిపై గొడవకు దిగడంతో ఘర్షణ చోటుచేసుకుంది. ఇరువర్గాలకు చెందిన వారు బాహా బాహీకి దిగి, పిడి గుద్దులతో బీభత్సం సృష్టించారు. దీంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు, వారి అటెండర్లు ఆందోళనకు గురయ్యారు. పట్టణ నడబడ్డొన ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలో క్రమంగా ఇంతటి అల్లర్లు జరుగుతుంటే అరికట్టాల్సిన ఆసుపత్రి సెక్యూరిటీ, పోలీసులు పూర్తి వైఫల్యం చెందారు. ఇలాంటి సంఘటనలు జరిగిన నేపథ్యంలో పోలీసులు కేసులు కూడా నమోదు చేయకపోవడంతో అల్లర్లు పరిపాటిగా మారుతున్నాయని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి ఆసుపత్రిలో ఎలాంటి అల్లర్లు, గొడవలు జరగకుండా నియంత్రించాలని ప్రజలు, రోగులు కోరుతున్నారు.



## మెరుగైన సదుపాయాలు కల్పించడమే లక్ష్యం

**(మొదటి పేజీ తరువాయి)**మున్సిపాలిటీ మరియు ఆరు మండలాల అభివృద్ధికి సిమెంట్ రోడ్లు తాగునీరు ఇండ్లు మాలిక వసతులు కల్పించడం జరిగినది. అంతేకాకుండా వైసీపీ ప్రభుత్వంలో రాజంపేట నియోజకవర్గానికి ఏమి చేసింది లేదని కానీ మేము వచ్చిన సంవత్సర కాలంలోనే ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగినది. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పోతుగుంట రమేష్ నాయుడు, రాజంపేట పట్టణ టిడిపి అధ్యక్షుడు దగ్గుపాటి సుబ్రహ్మణ్యం నాయుడు, క్లస్టర్ ఇంచార్జ్ కొల్లి రెడ్డయ్య నాయుడు, తెలుగుదేశం పార్టీ నాయకులు గంప శివ, పార్లమెంట్ కార్యదర్శి సుబ్రహ్మణ్యం నాయుడు, గుణకళ్ళ చిన్న కౌన్సిలర్ గుణకళ్ళ బుజ్జమ్మ, వార్డు ఇంచార్జ్ నాగమునాచారి, వినోద్ కుమార్, శంకరయ్య నాయుడు, పిచ్చయ్య నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి కేశవ, టైగర్ హుస్సేన్, కిషోర్ కుమార్, తేజ, రత్నం నాయుడు, యువ నాయకులు పరుశురాం నాయుడు, తేజాల ఆనంద్, నాగేంద్ర, పాండురాజు, పలువురు టిడిపి ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగినది.

**ప్రభుత్వ పథకాలు నిరుపేదలకు అందివ్వడమే కూటమి ప్రభుత్వ ధ్యేయం**

రాజంపేట పట్టణం గాంధీనగర్ 6వ వార్డు నందు ఇంటింటికి సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ ఇన్చార్జి చమర్తి జగన్ మోహన్ రాజు పాల్గొన్నారు . అనంతరం ఆయన గాంధీ నగర్ ఆరో వార్డు నందు ఇంటింటికి వెళ్లి ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక సంవత్సరం పాలన గురించి అభివృద్ధి మరియు సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఇంకా నాలుగు సంవత్సరాల కాలంలో మరెన్నో సంక్షేమ



పథకాలు మన రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపడతారని వారికి వివరించడం జరిగినది. అంతేకాకుండా ఆయన మాట్లాడుతూ రాజంపేట మున్సిపాలిటీ పరిధిలో గాంధీ నగర్ లో ఆరో వార్డు నందు 12 లక్షల రూపాయల నిధులతో సిమెంట్ రోడ్లను ప్రారంభించడం జరిగినది. ప్రజల సమస్యలు ఏమైనా ఉంటే మా దృష్టికి తెలియజేస్తే మేము వెంటనే పరిష్కరించి ప్రజలకు అందుబాటులో ఉంటామని తెలపడం జరిగినది. ఈ కార్యక్రమంలో రాజంపేట పట్టణ టిడిపి అధ్యక్షుడు దగ్గుపాటి సుబ్రహ్మణ్యం నాయుడు, క్లస్టర్ ఇంచార్జ్ కొల్లి రెడ్డయ్య నాయుడు, మున్సిపల్ కౌన్సిలర్ గుణకళ్ళ బుజ్జమ్మ,, గుణకళ్ళ చిన్న, తెలుగుదేశం పార్టీ నాయకులు గంప శివ, సుబ్రహ్మణ్యం నాయుడు కేశవ, టైగర్ హుస్సేన్, కిషోర్ కుమార్, నాగ ముని ఆచారి, వినోద్, శంకరయ్య, పిచ్చయ్య నాయుడు, కిషోర్, తేజ, రత్నం నాయుడు, టిడిపి యువ నాయకులు పాండురాజు, పరశురాం నాయుడు, తేజల ఆనంద్, నాగేంద్ర, పలువురు యువకులు కార్యకర్తలు పాల్గొన్నారు,

## పశువుల జాతిని కాపాడడమే జీవితాశయం

**(మొదటి పేజీ తరువాయి)**గోశాల భూముల్లో



మెతతో బాటు చిరుధాన్యాల పంటలు సేంద్రియ వ్యవసాయం చేపట్టారు, వేరుశనగ, జొన్న,సజ్జ, మొక్కజొన్న, కొర్రల పంటలను కేవలం సేంద్రియ ఎరువుల తోనే పంటలు సాగుచేస్తూన్నారు. ముఖ్యంగా పశువుల పేడ మూత్రంతో జల జీవామృతం,ఘనిజామృతం తయారుచేసి భూముల సారవంతనికి ఘానిజీవా మృతం పంటల చీడ,పీడల పిచికారికి జల జీవామృతం క్రిమి సంహారకలు లేని ప్రకృతి వ్యవసాయంతో పంటలు పండించి ఆదర్శంగా నిలిచారు,చుట్టుపక్కల ప్రాంతాల వ్యవసాయ రైతులు ప్రకృతి వ్యవసాయ పంటల విత్తనాల కోసం గోశాలను ఆశ్రయించడం ఆనవాయితీ,దూరదుష్టవస్తూ



జయరామాన్ 2021 ఫిబ్రవరిలో మరణించారు, జయరామాన్ మృతి పై మండలంలోని ప్రజలు, రైతులు కన్నీరుమున్నీరు అవ్వడం బాధాకరం,అప్పటినుంచి జయరామన్ కుమారుడు అయినటువంటి మణికంతన్ శివ ఆధ్వర్యంలో గోవులు గోశాలలో కలకలాడుతున్నాయి.

## సోది చెబుతామమ్మ సోది చెబుతాం

**(మొదటి పేజీ తరువాయి)**సార్లు సోది చెప్పేందుకు భారీగా ఖర్చు చేస్తున్నారని సమాచారం. అది ఎంతలా అంటే టిడిపిని మేమే నడిపిస్తున్నాం, టిడిపికి మేమే దిక్కు, మా తర్వాతే ఎవరైనా నాయకులు అనుకునే అంతగా. మరి ఇలాంటివారు అధిష్టానం వద్ద మార్పులు వేపించుకుంటారంటే అనుమానమే అని తెలుగు తమ్ముళ్లు బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు. అయితే అన్నమయ్య జిల్లాలోని కొన్ని నియోజకవర్గాలలో కొందరు నాయకులు టిడిపిని భ్రష్టు పట్టించడమే లక్ష్యంగా పనిచేస్తున్నారని ప్రజలు కోడై కూస్తున్నారు. ఎందుకంటే తాము పనిచేయవు కేవలం హంగామా చేస్తాం అనే విధంగా చాలా నాయకులు వ్యవహరిస్తున్నారు. తమను పట్టించుకోకపోతే ఎవరైనా సరే వారిపై రకరకాల సోది చెప్పిస్తూ గతంలోని సోది చెప్పే వారికి మించి రాజకీయ సోదిని ప్రజల చెవుల్లో ఊదుతూ తమ పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారు.

మరి ఇలాంటి సోది వీరులు ఉన్నది లేనట్లు లేనిది ఉన్నట్లు ప్రజలను నమ్మించే ప్రయత్నాలు ఫలిస్తాయో లేదో తెలియదు కానీ సోది చెప్పినప్పుడల్లా భారీగానే ఖర్చు చేస్తున్నారనే విమర్శలు మాత్రం జోరుగా ఉన్నాయి. అది పార్టీ నీ బలోపేతం చేయడం కంటే పార్టీని కొన్ని నియోజకవర్గాల్లో బతకనీయకుండా చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్న సదరు సోది వీరులకు అధిష్టానం అతి త్వరలోనే మంచి ట్రీట్మెంట్ ఇవ్వబోతుందని సమాచారం.

**రాజకీయ బాబోయ్ పులి కథ**

చిన్నప్పుడు మనం బాబాయ్ పులి కథ వినే ఉంటాం. ప్రస్తుతం రాజకీయాల్లో వింటున్నాం. అబద్దాలు ఒక్కరోజు రెండు రోజులు మూడు రోజులు ప్రజలు వింటారు కానీ ప్రతిరోజు ఏదో ఒక విధంగా ప్రజల చెవుల్లో పూలు పెడుతూ కథలు చెబితే మాత్రం నాయకులు కార్యకర్తలు కూడా సామాన్య ప్రజలు కూడా వినే పరిస్థితిలో లేరని కొందరు నాయకులు గమనించలేకపోవడం దురదృష్టకరంగా మారింది. ఎందుకంటే ప్రస్తుత కాలంలో ఏ సమాచారం కావాలన్నా సోషల్ మీడియా ద్వారా క్షణాలలో ప్రజలకు ఎంతకు చేరుతుంది. ఎక్కడ ఏం జరిగినా, ఎక్కడ ఏ వివాదం ఉన్న, ఏ మాట బయటకు వచ్చినా దాచుకోవడం చాలా కష్టం. అయితే కొందరు మాత్రం టిడిపి నాయకులకు కార్యకర్తలకు అన్ని విషయాలు తెలిసినా ఏదో చేయాలని తపనతో ఏదేదో చేస్తూ ప్రయోజనాలు పొందేందుకు నానా తంటాలు పడుతున్నారని, మరి అలా తంటాలు పడుతున్న వారు గురివింద గింజ సామెతను గుర్తు చేసుకోవాలని పలువురు తెలియజేస్తున్నారు. అయినా 40 సంవత్సరాల సుదీర్ఘ పార్టీ అయినా టిడిపిలో ఎవరు ఏం చేస్తున్నారో తెలుసుకునే అంత వ్యవస్థ తెలుగుదేశం పార్టీకి ఉందనే విషయం పాపం సదరు నాయకులు మరిచిపోతున్నారని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. అతి త్వరలోనే అందరికీ అర్థమయ్యేలా సోది భాషలోనే అధిష్టానం బాబోయ్ పులి కథకి ఫుల్ స్టాప్ పెట్టేందుకు రంగం సిద్ధం చేసింది. మరి అంతవరకు సోది చెప్పే వాళ్ళకి పనితో పాటు పైసలు వచ్చేలా సహకరించాలని పలువురు తెలుగు తమ్ముళ్లు తెలియజేస్తున్నారు. మొత్తానికి రాజకీయం పక్కనపెట్టి సరికొత్త సోదికియం మొదలెట్టిన నాయకుల ప్రయత్నాలు ఎన్నటికీ ఫలించవని పలువురు తెలుగు తమ్ముళ్లు తెలియజేస్తున్నారు.

సూర్య
www.suryaa.com
ఆదివారం
27 జులై 2025

## మేజర్ పంచాయతీలో పారిశుధ్యంపై సర్పంచ్ ప్రత్యేక దృష్టి





**నందలూరు మేజర్ న్యూస్:** నందలూరు మండలంలో గల నాగిరెడ్డిపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ ఆదేశాల మేరకు పారిశుధ్య కార్మికులు బస్టాండ్ కూడలి నుండి రైల్వే గేట్ వరకు బ్లీచింగ్ మరియు సున్నం కలిపి రోడ్డుకు ఇరువైపులా తడి ఉన్న ప్రాంతంలో వేయడం జరిగింది. వాతావరణం మార్పుల వల్ల దోమలు విపరీతంగా ఉండడంతో సర్పంచ్ ఈ నిర్ణయం తీసుకున్నారు.పంచాయతీ పరిసర ప్రాంతం బ్లీచింగ్ మరియు సున్నం కలిపి రోడ్డుకు ఇరువైపులా వేపించడం జరిగింది. చిన్న వర్షంపడితే ద్వి చక్ర వాహన దారులు, పాదాచారులు రోడ్డు దాటాలంటే చాలా ఇబ్బందులు పడే వారు శనివారం పంచాయతీ సిబ్బంది తో కలసి బస్టాండ్ సెంటర్లో ఉన్న గుంతలను కంకర రాళ్ళను వేసి పూడిపించడం జరిగింది. దీనితో అక్కడి ప్రజలు సర్పంచ్ కు అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా తాను మాట్లాడుతూ గడిచిన పదవీ కాలంలో ప్రథమంగా పారిశుధ్యం, రోడ్లు, మంచినీరు, వీధి దీపాలు వంటివి ఏ సమస్య వచ్చిన వెంటనే స్పందించి ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూసుకోవడం జరిగిందని తెలిపారు.

## మదనపల్లెకి చెందిన ఏపీఎస్పీ సిఐ అకస్మిక మృతి

**- కన్నీరుమున్నీరైన కుటుంబ సభ్యులు**



**మదనపల్లె టౌన్,మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ స్పెషల్ ఫోర్స్ 8వ బెటాలియన్ సిఐగా పనిచేస్తున్న కృష్ణనాయక్ (58) శనివారం ఆకస్మికంగా మృతి చెందారు.కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు వివరాలు.మదనపల్లె పట్టణం రెడ్డీస్ కాలనీకి చెందిన కృష్ణానాయక్ చిత్తూరులో స్పెషల్ పార్టీ సిఐగా పనిచేస్తున్నారు.నాలుగు రోజులు సెలవు పెట్టుకుని ఇంటికి వచ్చారు.శనివారం ఉదయం బాత్రూంకు వెళ్లిన అతను కాలుజారి కింద పడ్డాడు.గమనించిన కుటుంబ సభ్యులు బాధితున్ని వెంటనే మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు.పరీక్షించిన వైద్యులు అతడు మార్గమధ్యంలోనే మృతి చెందినట్లు తెలిపారు.కాగా గుండెపోటుతో మరణించాడా లేక మరేదైనా కారణమా అన్నది తెలియాల్సి ఉంది.మృతుడి మొదటి భార్య రమణి మృతి చెందడంతో సునీతను రెండో వివాహం చేసుకున్నాడు.రమణికి ఇద్దరు పిల్లలు రాఘవేంద్ర నాయక్,గీతాబాయి ఉండగా రెండో భార్య సునీతకు కుమార్తె శృతి ఉంది.ఈ ఘటనపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

## వడ్డెరలను ఎస్సీ లోకి చేర్చాలని వడ్డెర నాయకుల నిరసన కార్యక్రమం

**రైల్వేకోడూరు మేజర్ న్యూస్:** అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గంలో స్వాత్రంత్ర సమర యోధులు వడ్డె ఓబన్న విగ్రహం దగ్గర.కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు వడ్డెరలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని వడ్డెర సంఘం నాయకులునిరసన తెలియజేయడం జరిగింది. అంతేకాకుండా ఎన్నికల ముందు పాదయాత్రలో పల్లె పల్లెకు వచ్చి ప్రతి ఒక్క వడ్డెర సోదరులను కలిసి మా ప్రభుత్వం వచ్చిన తర్వాత మిమ్మల్ని ఎస్సీలకు చేరుస్తామని నాయకులు చెప్పడం జరిగిందని తెలిపారు.కావున రాష్ట్ర వ్యాప్తంగా కుల బంధువులు వివిధ ప్రభుత్వ పెద్దలకు గుర్తుకు తేవలసిందిగా మనవి. అంతేకాకుండా ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు యువకులు మొదలు వారు పాల్గొనడం జరిగినదని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు బట్టల శివయ్య చంద్రమౌళి సుబ్రహ్మణ్యం సుధాకర్ మల్లికార్జున వెంకటేశు, వేముల జయశంకర్, బత్తల లక్ష్మయ్య ఎన్ఆర్ఐ, విజయ్ కుమార్, ఓర్సు శ్రీరాములు, వెంకటేశు, పుల్లగంటి మధు, శివయ్య, మల్లికార్జున, వెంకటేశు ఎన్ఆర్ఐ , జయశంకర్ తదితరులు పాల్గొన్నారు.




## గిరిజన సంక్షేమ పాఠశాలలు, వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించండి

**-బాల్య వివాహాల నిర్మూలనకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోండి**

**- జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి**



**రాయచోటి,మేజర్ న్యూస్:** జిల్లాలోని గిరిజన వసతి గృహాలు, పాఠశాలలోని విద్యార్థులకు సౌకర్యంగా ఉండేందుకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో గిరిజన పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో చేపడుతున్న వివిధ రకాల అభివృద్ధి పనులకు సంబంధించి హాస్టల్ వార్డెన్ లు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి మాట్లాడుతూ...గిరిజన పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పెండింగ్ లో ఉన్న మరమ్మత్తుల పనులను నాణ్యతతో చేపట్టడంతో పాటు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం పాఠశాలలు వసతి గృహాల్లో నాణ్యతతో కూడిన ఆహార పదార్థాలను పిల్లలకి అందించాలన్నారు. స్టడీ అవర్ కు సంబంధించి టీచర్లు సక్రమంగా వచ్చే విధంగా చర్యలు తీసుకోవడంతో పాటు పిల్లలు గైర్హాజరు కాకుండా చూడాలన్నారు. అలాగే ఏఎన్ఎంలకు కేటాయించిన విధులను పర్యవేక్షిస్తూ సక్రమంగా చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. 6 నుండి 10 తరగతి వరకు చదువుతున్న అమ్మాయిలు రెండు రోజుల కంటే ఎక్కువగా హాజరుకాని పక్షంలో సంబంధిత ఉపాధ్యాయులు, వార్డెన్లు స్వయంగా విద్యార్థుల ఇళ్లకు వెళ్లి విషయాన్ని తెలుసుకొని పాఠశాలలక హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే మండల ప్రత్యేక అధికారులు, తాసిల్దారులు, మండల అభివృద్ధి అధికారులు తరచుగా పర్యవేక్షించి సంబంధిత నివేదిక ఇవ్వాలని కలెక్టర్ సూచించారు.వసతి గృహాలు తరగతి గదులలో లైట్లు, ఫ్యాన్లు తదితర సదుపాయాలను పరిశీలించి అవసరమైన మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే త్రాగునీటి వసతి, టాయిలెట్లు విద్యార్థులకు అందుబాటులో ఉంచాలన్నారు. అవసరమైన మరమ్మత్తులను వెంటనే చేయించేందుకు చర్యలు తీసుకోవాలని డిటిడబ్ల్యుఓను కలెక్టర్ ఆదేశించారు. వసతి గృహాల్లో మౌలిక వసతుల కల్పనకు అవసరమైతే దాతల సహకారం తీసుకొని ఏర్పాట్లు చేసేందుకు సంబంధిత తాసిల్దార్లు, ఎంపీడీవోలతో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటానని కలెక్టర్ తెలిపారు. పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవడంతో పాటు క్రమం తప్పకుండా పిల్లలకు నులిపురుగుల మాత్రలు, ఐరన్ టాబ్లెట్ లు, ఆరోగ్య సూచనలు వారికి షెడ్యూల్ ప్రకారం అందించే విధంగా చూడాలని అన్నారు. పిల్లలు హాజరు కాలేకపోయినా వెంటనే పై అధికారులకు తెలియజేయాలని తెలిపారు. పిల్లల హాజరు విషయంలో శ్రద్ధ వహించాలని, ముఖ్యంగా బాలికల హాజరుపై మరింత జాగ్రత్త వహించాలన్నారు.లి

**బాల్య వివాహాల నిర్మూలనకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోండి**

జిల్లాలో బాల్యవివాహాలు జరగకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సంబంధిత కమిటీ సభ్యులను జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదేశించారు. బాల్య వివాహాలు అత్యంత ప్రమాదకరమని ఏ ప్రాంతంలో జరిగిన నిరోధించేందుకు అప్రమత్తంగా ఉండాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగినా, ప్రోత్సహించినా బాల్య వివాహాల నిషేధ చట్టప్రకారం చర్యలు తీసుకోబడతాయని బాల్య వివాహాల నిర్మూలనపై క్షేత్రస్థాయిలో తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు.

## పిజిఆర్ఎస్ అర్జీలను నాణ్యతతో పరిష్కరించాలి

**-జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి**





**రాయచోటి,మేజర్ న్యూస్:** పిజిఆర్ఎస్ అర్జీలను నాణ్యతతో పరిష్కరించాలని వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు.శనివారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా అధికారులు ఎమ్మార్వోలు ఎంపీడీవోలు తదితరులతో స్వర్ణాంధ్ర పి 4, ఓటరు జాబితా సవరణ, పి జి ఆర్ ఎస్ అర్జీల పరిష్కారాలు, సంక్షేమ శాఖల హాస్టళ్లు, పాఠశాలల ఆకస్మిక తనిఖీలు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... జిల్లా స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు ఉన్న అధికారులు మరియు సిబ్బంది స్వర్ణాంధ్ర పి-4 కార్యక్రమంలో పాలుపంచుకొని వారికి చేతనైన చేయూతను పేదవారికి అందజేయాలని సూచించారు. తాను 10 కుటుంబాలు సంయుక్త కలెక్టర్ 10 కుటుంబాలను దత్తత తీసుకున్నామని ఆ కుటుంబాలలోని పిల్లలకు ఉపాధి కల్పనలో సలహాలు ఇవ్వడం చేయూతనివ్వడం వంటి చర్యలు చేపడతామన్నారు. ఇదేవిధంగా ప్రభుత్వ ఉద్యోగులందరూ వారికి తోచిన సహాయాన్ని చేయాలని సూచించారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. ఓటర్ల జాబితా సవరణ పై సమీక్షిస్తూ... ఫారం 7 8 తదితర పెండింగ్ లో ఉన్న ఫారంలను త్వరగా ప్రాసెస్ చేయాలని రాజకీయ పార్టీల సూచనల మేరకు తీసుకోవాల్సిన చర్యలు ఏమైనా పెండింగ్లో ఉంటే వాటిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్, రాయచోటి ఆర్డిఓ శ్రీనివాస్, జిల్లా అధికారులు, ఎమ్మార్వోలు ఎంపీడీవోలు, తదితరులు పాల్గొన్నారు.

## సవరించిన రెవెన్యూ మ్యాన్యువల్లను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి

**రాయచోటి, మేజర్ న్యూస్:**శనివారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో సవరించిన రెవెన్యూ మ్యాన్యువల్ పుస్తకాలను జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ మరియు మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ లతో కలిసి ఆవిష్కరించారు. సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సవరించబడిన 14 రెవెన్యూ మ్యాన్యువల్ లు (అసైన్మెంట్ భూములు, చుక్కల భూములు, పెన్షన్ రూల్స్ తదితర అంశాలు) సిబ్బందికి అందుబాటులో ఉన్నాయని వీటిని రెవెన్యూ శాఖ అధికారులు మరియు సిబ్బంది పరిపాలనలో వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాయచోటి ఆర్డిఓ శ్రీనివాస్, అన్నమయ్య జిల్లాలోని తాసిల్దారులు తదితరులు పాల్గొన్నారు.



# పార్టీకోసం కష్టపడిన ప్రతి ఒక్కరికి అవకాశం కల్పిస్తా..



**కేవిపల్లి, మేజర్ న్యూస్ :** అన్నమయ్య జిల్లా : పీలేరు నియోజవర్గం సహకార సంఘాలకు ఎట్టకేలకు ఏడాది కాలం తర్వాత ఎన్నికల నగారా మోగింది. ఆశావాదులు ఎప్పటినుంచో వేచి చూసిన తరుణం రానే వచ్చింది. అదృష్టం కొందరినే వరించింది. తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి పీలేరు నియోజకవర్గ శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ఈ మేరకు నియోజవర్గ మండలాల్లో సహకార కేంద్రాల పరిధిలో ఎవరెవరిని చైర్మన్‌లు, డైరెక్టర్ లను నియమించాలో ఒకటికి రెండుసార్లు స్థానిక నేతలతో చర్చించి ఒక నిర్ణయానికి వచ్చారు. ఈ మేరకు వడపోత కార్యక్రమం అనంతరం పూర్తి నివేదికను ప్రభుత్వానికి అందజేశారు. అక్కడి నుండి చైర్మన్ లు, డైరెక్టర్లు అధికారిక జాబితా రావడంతో ఈ క్రమంలో కంభం వారి పల్లి, గుఱ్ఱం కొండ, వాల్మీకిపురం మండలాల పరిధిలో సహకార సంఘాలకు చైర్మన్ లు, డైరెక్టర్లుగా ఒకే రోజులో కంభం వారి పల్లె, గుఱ్ఱం కొండ, వాల్మీకి పురం ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి, సంబంధిత అధికారుల సమక్షంలో చైర్మన్లు డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన సహకార సంఘం చైర్మన్ లు, డైరెక్టర్లు సంబంధిత ప్రజలు, రైతులతో మమేకమై అందరికి అందు బాటులో ఉండి సహాయ సహకారాలు అందించాలని సుచించారు. పార్టీ కోసం అహర్నిశలు కష్ట పడి మా కుటుంబానికి అండగా నిలబడి ఆదరించి తన గెలుపుకు కృషి చేసిన అందరికి అవకాశం కల్పిస్తానని భరోసా కల్పించారు. పీలేరు, కలికిరి, కలకడ మండలాలకు చైర్మన్లు డైరెక్టర్లుగా త్వరలో ప్రకటిస్తామని అన్నారు. చైర్మన్‌లు మాట్లాడుతూ తమ పరిధిలోని సహకార సంఘాల అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు. నియోజవర్గ ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా సహకార సంఘాల బలోపేతానికి కృషి చేస్తామన్నారు. కంభం వారి పల్లి సహకార సంఘం చైర్మన్, నల్లపురెడ్డి సురేష్ రెడ్డి, డైరెక్టర్లుగా మఠంపల్లి కి చెందిన దూరే నారాయణ, వెంకటరమణ, గుఱ్ఱం కొండ మండలం నుండి చైర్మన్ గా ఎం.ఎల్.ఎన్ మూర్తి రావు (స్వామి), డైరెక్టర్లు గా గుర్రంకొండకు చెందిన సాలార్ సాబ్, అమిలే పల్లికి చెందిన సత్య నారాయణ రెడ్డి, వాల్మీకిపురం మండలం నుండి చైర్మన్ గా సాకి రేవుపల్లెకు చెందిన కె. కృష్ణారెడ్డి, డైరెక్టర్లుగా చింతపర్తి పంచాయతీ పుల్లెట్ చెరువుపల్లెకు చెందిన లంకె పల్లె మధు, వాల్మీపురానికి చెందిన మొహిద్దిన్ అలీ ఖాన్ (చాను)గా ఎన్నికైన వీరు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, కూటమి శ్రేణులు కార్య కర్తలునల్లారిఅభిమానులుపెద్దఎత్తున పాల్గొని కార్యక్రమాల్ని విజయ వంతంచేశారు.

# దృఢ సంకల్పమే విజయానికి మార్గం



**రాజంపేట,మేజర్‌న్యూస్ :** అన్నమాచార్య విశ్వవిద్యాలయం, రాజంపేటలో శనివారం ఉదయం ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ ఆధ్వర్యంలో "ద పవర్ విదిన్ – ఇన్స్పైరింగ్ యంగ్ ఉమెన్ ఫర్ గ్రేటర్ గోల్స్" అనే ప్రత్యేక కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఐఆర్ఎస్ అధికారి కె ఎస్ కీర్తి రెడ్డి మాట్లాడుతూ ప్రతి మహిళకు ఒక లక్ష్యం ఉండాలి. క్రమశిక్షణ, దృఢ సంకల్పం, అంకితభావం వంటి లక్షణాలను అలవర్చుకోవడం వలన మహిళలు తమ లక్ష్యాన్ని చేరుకో గలరని పేర్కొన్నారు. "స్త్రీలో ఉన్న అంతర్యామి శక్తిని గుర్తించడం విజయానికి తొలి మెట్టు. మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే ఏ రంగంలో అయినా విజయవంతం కావచ్చని ఆమె అభిప్రాయపడ్డారు. "నిన్ను నువ్వు నమ్ముకో ప్రపంచం నిన్ను గుర్తించ కుండా ఉండదు" అని విద్యార్థినులను ప్రేరేపించారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ ఈ. సాయిబాబా రెడ్డి మాట్లాడుతూ, ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు దోహదపడతాయని అన్నారు. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ స్వర్ణలతా విద్య క్రమశిక్షణతోనే మహిళలు సమాజంలో మార్పును తీసుకురాగలరని అన్నారు. సాంకేతిక రంగాల్లో మహిళలు మరింత ముందుకు రావాలని ఆమె ఆకాంక్షించారు. ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ ఇన్చార్జ్ డాక్టర్ వి. మౌనిశ్వరి మాట్లాడుతూ, "ఇది కేవలం మొదటి అడుగు మాత్రమే. మేము మరిన్ని కార్యక్రమాల ద్వారా మహిళా విద్యార్థులకు నైతిక బలాన్ని అందించేందుకు కృషి చేస్తాము" అని చెప్పారు. ఈ కార్యక్రమంలో అన్నమాచార్య యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఈ. సాయిబాబా రెడ్డి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ స్వర్ణలత, పీజీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డీజే సమతా నాయుడు, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ ఇన్చార్జ్ డాక్టర్ వి. మౌనీశ్వరి, డిపార్ట్మెంట్ హెచ్వోడీస్, ఫ్యాకల్టీ మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.






# శనీశ్వరునికి ప్రత్యేక పూజలు



**సిద్ధవటం మేజర్‌న్యూస్ :** మండలంలోని, కడప – చెన్నై జాతీయ రహదారి పెద్దపల్లి గ్రామపంచాయతీ కనుములోపల్లె గ్రామంలో వెలిసిన శ్రీ మందగిరి శనీశ్వర స్వామికి శ్రావణ శనివారం ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సుబ్రమణ్యం శర్మ మాట్లాడుతూ తొలి శ్రావణ శనివారంసందర్భంగాశనేశ్వరస్వామికి ఒంటి మిట్ట, కడప, బద్వేల్, మాధవరం సిద్ధవటం దూర ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తైలాభిషేకం వంటి పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు అని వారన్నారు శ్రావణ మాసంలో శనిగ్రహ,దోషాలుఉన్నవారు శనీశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తే తొలగిపోతాయని అన్నారు

# విద్యతోపాటు క్రీడల్లో రాణించాలి



**సంబేపల్లి మేజర్‌న్యూస్ :** విద్యార్థులు విద్య తో పాటు క్రీడల్లో రాణించాలని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ శెట్టిపల్లి శాఖ బ్రాంచ్ మేనేజర్ కె. అరుణకుమారి తెలిపారు. శెట్టిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో గ్రామీణ బ్యాంక్ శెట్టిపల్లి శాఖఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల శెట్టిపల్లి, పెద్దజంగంపల్లి విద్యార్థులకు కోకో, కబడి, వాలీబాల్,ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో పోటీ తత్వం ఉండాలని తెలిపారు. క్రీడలు శారీరక మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడ తాయన్నారు . గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికి తీయడానికే గ్రామ మండల స్థాయి జిల్లాస్థాయిలలోపోటీలుజరుగుతాయి అన్నారు. అనంతరం గెలుపొందిన వారికి ట్రోఫీ బహుమతులు అందజేశారు ఈ కార్యక్రమం లో శెట్టిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర, పెద్ద జంగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుధాకర్, ఉపాధ్యాయులు మురళీకుమార్, వసంత, గోపాల్ ,సిద్దయ్య ,పిడి సోమశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.




# ఐఐటీ లో సీటు సాధించిన పూర్వపు విద్యార్థిని సాయి కీర్తన

## పూర్వపు విద్యార్థులకు సన్మానం



**సంబేపల్లి మేజర్ న్యూస్ :** సంబేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వపువిద్యార్థి కత్తిసాయికీర్తనబోద్‌పూర్ఐఐటిలో కంప్యూటర్ సైన్స్ సీటు సాధించినట్లు సంబేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుంకర రామకృష్ణ తెలిపారు . శనివారం పూర్వపు విద్యార్థులకు అభినందన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన పాఠశాల పూర్వ విద్యార్థి కత్తి సాయి కీర్తన జోద్ పూర్ ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ సీటు సాధించి సంబేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు కీర్తి ప్రతిష్టలు తెచ్చిందన్నారు. ఈమె పదవ తరగతిలో 540 మార్కులు, ఇంటర్లో 980 మార్కులు సాధించిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలలో చదివే విద్యార్థులకు సాయి కీర్తన ఒక ఆదర్శమన్నారు. పదో తరగతి వరకు మన పాఠశాలలో చదివి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో మనుబోతు వెంకటసుబ్బయ్య బైపిసి గ్రూపు లో 433/440 మార్కులు, కత్తి వర్షిని ఎంపీసీ గ్రూప్ లో 463 /470 మార్కులు, పదవ తరగతిలో షేక్ రుక్సానా 577 /600మార్కులు సాధించి షైనింగ్ స్టార్‌గా ప్రభుత్వము నుండి20 వేల రూపాయలు అందుకున్నట్లు తెలిపారు . విద్యా ప్రగతి లో ముందుకెళ్తున్న సంబేపల్లి హై స్కూల్ వైపు విద్యార్థులు అడుగులు వేయాలన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులను దుశ్శాలువా, సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



# నిందితులకు శిక్ష పడేలా కృషి చేయాలి

- కేసుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉన్నతాధికారులకు నివేదించాలి
- కోర్టు కానిస్టేబుళ్లతో సమీక్షా సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ (పరిపాలన) వెంకటాద్రి




**రాయచోటి ప్రతినిధి, మేజర్‌న్యూస్:** సకాలంలో సాక్షులను కోర్టులో హాజరుపర్చి బాధితులకు న్యాయం జరిగేలా, సాక్ష్యాధారాలతో నేర నిరూపణ చేసి నిందితులకు శిక్ష పడేలా కృషి చేయాలని జిల్లా జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు, జిల్లా అదనపు ఎస్పీ (పరిపాలన) వెంకటాద్రి కోర్ట్ మానిటరింగ్ సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. శనివారం స్థానిక పోలీసు సమావేశ మందిరంలో జిల్లాలోని కోర్టు మానిటరింగ్ సిబ్బంది, పోలీస్ స్టేషన్ లకు చెందిన కోర్టు కానిస్టేబుళ్ల తో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు ఎస్పీ మాట్లాడుతూ కేసుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉన్నతాధికారులకు నివేదించాలని ఆదేశించారు. అన్ని ట్రయల్ కేసుల్లో సత్వర, సక్రమ విచారణ జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కోర్టులలో ఛార్జ్ షీట్ ఫైల్ చేసిన అనంతరం కోర్ట్ ద్వారా సంబంధిత కేసులలో సి.సి నెంబర్లను తీసుకునేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు పెండింగ్ సమన్లు జారీ అయ్యేలా, వారెంట్లు అమలు జరిగేలా తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నూతనంగా అమలులోకొచ్చిన బి.ఎన్.ఎస్.ఎస్ చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. కొత్త చట్టం మేరకు కోర్టు ప్రొసీడింగ్స్ జరిగేలా చూడాలని ఆయన ఆదేశించారు. ప్రతి కోర్టు కానిస్టేబుల్ విధిగా తన పోలీస్ స్టేషన్ కు సంబంధించి కోర్టులో హాజరవుతున్న ప్రతి కేసు గురించి అవగాహన పెంచుకుని సరైన సాక్ష్యాధారాలతో నిందితులకు శిక్ష పడేలా చూడాలన్నారు. కోర్టు ట్రయల్ సందర్భంలో సంబంధిత స్టేషన్ హౌస్ అధికారి కూడా సమర్ధవంతంగా కేసు విచారణ జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో కోర్టు మానిటరింగ్ సెల్ ఇంచార్జ్ ఇన్స్పెక్టర్ జి. ఆదినారాయణ రెడ్డి, ఎస్ఐ రవికుమార్. కోర్ట్ మానిటరింగ్ సిబ్బంది, కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

# సాంకేతిక పురోభివృద్ధి,నూతన ఆవిష్కరణల్లో జనరేటివ్ ఏఐ కీలకం

– ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో సెమినార్




**మదనపల్లె రూరల్,మేజర్ న్యూస్ :** పుంగనూరు రోడ్డులోని ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లోని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్ (ఏఐ అండ్ డీఎస్),ఇన్స్టిట్యూట్ యొక్క ఇన్నోవేషన్ సెల్ (ఐఐసీ) సహకారంతో కళాశాల ప్రాంగణంలో "జనరేటివ్ ఏఐ : ట్రాన్స్ ఫార్మింగ్ ది ఫ్యూచర్ ఆఫ్ క్రియేషన్" అనే అంశంపై శనివారం ఒక సెమినార్‌ను నిర్వహించారు.బహుళ డొమైన్‌లలో సృజనాత్మకత ,ఆటోమేషన్‌సమస్య పరిష్కారాన్ని విప్లవాత్మకంగా మారుస్తున్న వేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతికత అయిన జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ గురించి విద్యార్థులు మరియు అధ్యాపక సభ్యులకు లోతైన అవగాహన కల్పించడం ఈ సెమినార్ ప్రధాన ఉద్దేశ్యం.ఈ కార్యక్రమానికికరస్పాండెంట్ ఆర్.రామమోహన్ రెడ్డి,కార్యదర్శి ఎం.నాగమల్లా రెడ్డి,డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగా రెడ్డి ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాయుడు హాజంయ్యారు. డిజిటల్ యుగంలో పోటీతత్వాన్ని కొనసాగించడానికి కొత్త సాంకేతికతలను స్వీకరించడం యొక్క ప్రాముఖ్యతను వారు నొక్కి చెప్పారు. వివిధ విభాగాల డీన్‌లు అధిపతులు పాల్గొన్నారు.ఇది ఈ సందర్భానికి ప్రాముఖ్యతను జోడించింది.ఈ సెమినార్‌కు రిసోర్స్ పర్సనుగా కె.సందీప్ కుమార్ రెడ్డి వ్యవహరించి జనరేటివ్ ఏఐ యొక్క భావనలు, అనువర్తనాలు మరియు భవిష్యత్తు ధోరణులపై సమగ్రమైన సెషన్‌ను అందిం చారు.కంటెంట్ సృష్టి,డిజైన్,ఆరోగ్య సంరక్షణ మరియు ఆటోమేషన్ వంటి రంగాలలో దాని పరివర్తన ప్రభావాన్ని ఆయన వివరించారు.ఈ సెషన్ వాస్తవ ప్రపంచ వినియోగ కేసులు,సవాళ్లుసాంకేతి కతతో ముడిపడి ఉన్న నైతిక పరిగణనలను కూడా హైలైట్ చేసింది. జనరేటివ్ ఏఐ పరిశ్రమలను ఎలా రూపొందిస్తుందో మరియు ఆవి ష్కరణలను ఎలా ప్రభావితం చేస్తుందో గురించి పాల్గొనేవారికి విలువైన జ్ఞానాన్ని అందించింది.ఈ సెమినారులో విద్యార్థులు అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వారు చర్చలలో చురుకుగా పాల్గొన్నారు.వారి సందేహాలను స్పష్టం చేసుకోవడానికినిపుణులతోసంభాషించారు.ఏఐ-ఆధారిత ఆవిష్కరణలను అన్వేషించడానికి సాంకేతిక పురోగతికి దోహదపడటానికి యువ మనస్సులను ప్రేరేపించడానికి ఈ కార్యక్రమం ఒక వేదికగా పనిచేసింది.ఈ సెమి నారును గొప్పగా విజయవంతం చేయడంలో మద్దతు ఇచ్చినందుకు రిసోర్స్ పర్సన్‌అన్ని ప్రముఖులకు యాజమాన్యంనిర్వాహ కులు కృతజ్ఞతలు తెలిపారు.ఇటువంటి కార్యక్రమాల ద్వారా అత్యాధునిక జ్ఞానం ఆవిష్కరణలను పెంపొందించడంలో ఆదిత్యకాలేజ్‌ఆఫ్ ఇంజనీరింగ్ యొక్క నిబద్ధతను పునరుద్ఘాటించింది.

# న్యాయవాది అమరనారాయణ సేవలు ప్రభుత్వానికి ఎంతో అవసరం

– ఘనంగా సన్మానించిన జనసేన నాయకుడు శ్రీరామ రామాంజనేయులు




**మదనపల్లె,మేజర్‌న్యూస్ :** పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయం నందు మదనపల్లి నియోజకవర్గం జనసేన పార్టీ సీనియర్ నాయకులు శ్రీరామ రామాంజనేయులు ఆధ్వర్యంలో తిరుపతి ప్రత్యేక న్యాయస్థానానికి ఎర్రచందనం స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటరుగా ఎంపికైన చెందిన ప్రముఖ సీనియర్ న్యాయవాది మరియు చిత్తూరు జిల్లా జనసేన పార్టీ లీగల్ సెల్ అధ్యక్షులు అమర నారాయణని ఘనంగా సత్కరించి శుభాకాంక్షలుతెలిపారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అమర నారాయణ మరెన్నో ఉన్నత పదవులు పొందాలని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంఆయన్నుగుర్తించిఈ యొక్క కర్తవ్యాన్ని ఇచ్చినందుకుగాను జనసేన పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ కి ప్రత్యేక ధన్యవా దాలు తెలిపారు. ఆ దేవదేవుని ఆశీస్సులు వారిపై వారి కుటుంబ సభ్యులపైఎల్లప్పుడూఉండాలని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్ర మంలో జగదీష్, ఆంజనేయ కుమార్, లీలా కర్,బాలాజీ, శ్రీనివాసులు,నక్క కృష్ణమూర్తి, సుబ్రహ్మణ్యం, చలపతి,గురు ప్రసాద్,కుమార్, పురంధర్, కిరణ్, అశోక్,సాయి,నవాజ్ ,రాజేష్,ఉమా, సోను,అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టంపై అవగాహన అవసరం

మండల వ్యవసాయ అధికారి జి.మల్లిఖార్జున





**నందలూరు మేజర్‌న్యూస్:** సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి వుండాలని నందలూరు మండల వ్యవసాయ అధికారి జి. మల్లిఖా ర్జున తెలిపారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని నల్లతిమ్మాయ పల్లి రైతు సేవా కేంద్రం నందు శనివారం సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి జి. మల్లిఖార్జున మాట్లాడుతూ రైతులు తమకుకావలసిన సమా చారాన్ని వ్యవసాయ శాఖలోసంబందితపౌర సమాచార అధికారికి దరఖాస్తు చేసి సమాచారాన్ని పొందవచ్చునని అన్నారు. ఈ చట్టం వలన రైతులు తమకు కావాల్సిన సమాచారాన్ని సేకరించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్ర మంలో రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# రౌడీషీటర్లు సమాజంలో సత్ప్రవర్తనతో మెలగాలి

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠినచర్యలు - డిఎస్పీ మహేంద్ర సూచనలు

**మదనపల్లె,మేజర్‌న్యూస్ :** అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని,సత్ప్రవర్తనతో సమాజంలో మెలగాలని డిఎస్పీ మహేంద్ర తెలిపారు. శనివారంపట్టణంలోని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న రౌడీషీటర్లకు డీఎస్పీ కార్యాలయ ఆవరణంలో కౌన్సిలింగ్ నిర్వహించారు.శాంతిభద్రతల పర్యవేక్షణలో భాగంగా రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉందని,చట్టాన్ని అతిక్రమించి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఆర్థికపరమైన అంశాలు,భూదందాలు,సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం వంటి విషయాలు తమ దృష్టికి వస్తే తగు రీతిలో చర్యలు తీసుకుంటామన్నారు.జీవితంలో జరిగిన కొన్ని పొరపాట్ల వల్ల కేసులు నమోదై పోలీసు రికార్డుల్లో రౌడీ షీటర్లుగా నమోదయ్యారని,సమాజంలో సత్ప్రవర్తనతో మెలిగినప్పుడే మీకు,మీ కుటుంబాలకు విలువ ఉంటుందని తెలిపారు.ఈ సందర్భంగా ప్రతి ఒక్కరి షీట్లను తనిఖీ చేసి,వారి కేసులను పరి శీలించి,వారిలో సత్ప్రవర్తన తీసుకొచ్చేందుకు కౌన్సిలింగ్ ఇచ్చారు. సత్ప్రవర్తన తో మెలిగితే క్రమంగా షీట్లను తొలగిస్తామని,లేనిపక్షంలో చట్ట పరిధిలో తీసుకునే కఠిన చర్యల గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో డిఎస్పీతో పాటు సిఐలు,ఎస్.ఐలు,సిబ్బంది పాల్గొన్నారు.



## విద్యార్థులకు ఆర్టీసీ బస్ స్టేజ్ సౌకర్యం కల్పించాలి : ఏఐఎస్ఎఫ్ డిమాండ్



**పీలేరు మేజర్‌న్యూస్** : పీలేరు చిత్తూరు రోడ్డు నందు యం జె ఆర్ కళాశాల వద్దఆర్టిసి బస్‌స్టాప్ ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మాధవ్ కుమార్, పీలేరు పట్టణ కార్యదర్శి వినోద్ నాయుడు డిమాండ్ చేశారు శనివారంఆర్టిసిడిపోమేనేజర్‌కు బస్ స్టాప్ సౌకర్యం కల్పించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు వినతి పత్రం అందజేసి అనంతరం డిపో మేనేజర్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీ బస్సులు ఆపాలని గతంలో అనేకమార్లు ఆర్టీసీ సిబ్బందికి డ్రైవర్లకు తెలియజేసిన వారు విద్యార్థులపట్లనిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ బస్సులు ఆపడం లేదని ఆరోపించారు పై విషయంపై డ్రైవర్ను అడిగితే విద్యార్థులపై దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు ఇప్పటికైనా ఆర్టీసీ డిఎం కళాశాల వద్ద ఆర్టీసీ బస్ స్టాప్ సౌకర్యం విద్యార్థులకు కల్పించాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున విద్యార్థులను కలుపుకొని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జాతీయ రహదారిని దిగ్బంధనం చేస్తామనిహెచ్చరించారుఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు సురేష్, జగదీష్ రెడ్డి, వేళాయిదం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పిటిఐల పనివేళల్లో స్పష్టత కోసం వినతి



**సిద్ధవటం మేజర్ న్యూస్** : రాష్ట్రంలోని జడ్పి ఉన్నత పాఠశాలల్లో సమగ్ర శిక్ష కింద పనిచేస్తున్న డ్రాయింగ్, క్రాఫ్ట్, పిఈ టి, మరికొన్ని విభాగాల పార్ట్ టైం ఉపాధ్యాయుల పనివేళల్లో గందరగోళ పరిస్థితి నెలకొందని, స్పష్టత ఇస్తూ ఎస్పీడి, విద్యా శాఖ కమిషనర్ నుంచి ఉత్తర్వులు వచ్చేలా కృషి చేయాలని పిటిఐల సంఘం 138/2017 రాష్ట్ర కోశాధికారి బద్వేలి చిన్న వెంకటయ్య , రాష్ట్ర అధ్యక్షులు సాయిశ్రీనివాస్ ను, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథ రెడ్డి ని కోరారు. విజయవాడలోని ఎస్టియు కార్యాలయంలో శనివారం చిన్న వెంకటయ్య వారిని కలసి పిటిఐల సమస్యలను వివరించారు. పనివేళలు, ఫెషియల్ హాజరుపై త్వరితగతినా ఉత్తర్వులు ఇచ్చేలా కృషి చేయాలని వారికి వినతి పత్రం సమర్పించారు.

## పోస్టాఫీస్‌లో గతంలో ఉన్న రిజిస్టర్ పోస్టును అమలు చేయాలి

కామ్రేడ్ పండు గోల మణి

**రైల్వే కోడూరు రూరల్ మేజర్‌న్యూస్ :** అన్నమయ్య జిల్లా అధ్యక్షులు కామ్రేడ్ పండు గోల మణి, వైయస్సార్సీపి రైల్వే కోడూరు నియోజకవర్గం ఎస్సీ ఎస్టీ కన్వీనర్ దామర్ల సిద్దయ్య స్థానిక పట్టణ పోస్టాఫస్ లో రిజిస్టర్ పోస్టు చేయడాన్ని పరిశీలించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిజిస్టర్ పోస్ట్ ఆన్లైన్ పనిచేయకపోవడంతో రిజిస్టర్ పోస్ట్ చేయాలని వచ్చినవారు గంటల తరబడి నిలబడిన రిజిస్టర్ పోస్ట్ పంపించలేక అనేకమంది చాలా ఇబ్బందులు పడి వెను తిరిగి పోతున్నారని, అదేవిధంగా రిజిస్టర్ పోస్ట్ చేస్తున్న పోస్ట్ ఆఫీస్‌లో ఉన్న సిబ్బంది కూడా కంప్యూటర్లు పనిచేయకపోవడంతో వచ్చిన కస్టమర్లతో నానా బూతులు మాటలు పడాల్సి వస్తుందని తక్షణమే కేంద్ర ప్రభుత్వం రిజిస్టర్ పోస్ట్ చేయాలంటే పాత పద్ధతిలోనే రిజిస్టర్ పోస్టు చేసే విధంగా అమలు చేయాలని వారు కోరారు. ఈ పరిశీలన కార్యక్రమంలో గంగాధర్, లక్ష్మయ్య, నారాయణ, రిజిస్టర్ పోస్ట్ చేయడానికి వచ్చిన కస్టమర్లు తదితరులు పాల్గొన్నారు.



### బొప్పాయి రైతులు గిట్టుబాటు ధర కల్పించాలని

## 28న రాజంపేట సబ్ కలెక్టర్ ఆఫీస్ వద్ద ధర్నా జయప్రదం చేయండి

సమావేశంలో రైతు సంఘాల పిలుపు



**చిట్వేలి మేజర్‌న్యూస్** : అన్నమయ్య జిల్లా చిట్వేల్ మండలం అంబేద్కర్ విగ్రహ వద్ద ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం సిఐటియు ఆధ్వర్యంలో సాయంత్రం బొప్పాయి రైతులు గిట్టుబాటు ధర కోసం నిరసన వ్యక్తం చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ చంద్రశేఖర్, ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు పంది కాలమని మాట్లాడుతూ గత మూడు రోజులుగా చిట్టి వేల రైతులు వేలాది ఎకరాల్లో సాగు చేస్తున్న రైతులు ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. వారికి గిట్టుబాటు ధర కనీసం 25 రూపాయలు కల్పించాలని డిమాండ్ చేశారు. మొదట 16రూపాయలు నిర్ణయించి మూడు రోజుల్లో 13రూపాయలకు తగ్గించడంతో, రోజు రోజుకి దళారులు సిండికేట్ ధర తగ్గించడంతో బొప్పాయి రైతులు ఆందోళనకు దిగారు అన్నారు. ప్రభుత్వం జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని వ్యాపారస్తులతోనూ మార్కెట్ అధికారులతోనూ రెవెన్యూ అధికారులతోనూ జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేసి కనీస మద్దతు ధర 25 రూపాయలు నిర్ణయించాలని డిమాండ్ చేశారు. రైతులు పెట్టిన పెట్టుబడి విత్తనాలు మొలక కొనుగోలు, ఎరువులు దుక్కెలు కూలీలు మందులు ట్రాన్స్పోర్ట్ ధరలు విపరీతంగా పెరిగాయి అన్నారు. పెట్టిన పెట్టుబడి కూడా రాకపోతే రైతుల ఆత్మహత్యలు చేసుకోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. దళారులు సూటు వడ్డీ, పర్సంటేజీ నకిలీ విత్తనాలు రైతుల్ని మోసం చేస్తున్నారన్నారు.దీనికి నిరసనగా 28వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకి రాజంపేట సబ్ కలెక్టర్ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించి వినతి పత్రం ఇవ్వడం జరుగుతుందని. రైతులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు వై ఆదినారాయణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఓ పెంచలయ్య తుంగ శివకృష్ణ కొండల సాయి బాబు ఎం బాల సంతోష్ రెడ్డి మన్నూరు విశ్వనాథరెడ్డి తుంగ కోటేశ్వర చౌదరి పురం రమణయ్య సి సుబ్బరాయుడు రవిరాజు వై ప్రేమ్చంద్ తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రమశిక్షణ,సామాజిక బాధ్యతను పెంపొందించుకోవాలి

పోర్డ్ సంస్థ డైరెక్టర్ జల్లా లలితమ్మ సూచనలు



**మదనపల్లె రూరల్,మేజర్ న్యూస్ :** ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించడంతో పాటు సామాజిక బాధ్యత కలిగి ఉండాలని పోర్డ్ సంస్థ డైరెక్టర్ జల్లా లలితమ్మ పేర్కొన్నారు. శనివారం స్థానిక హోప్ మునిసిపల్ హైస్కూల్స్ నందు విద్యార్థులకు సామాజిక విద్య,క్రమశిక్షణ గురించి ఆవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోర్డ్ సంస్థ డైరెక్టర్ లలితమ్మ మాట్లాడుతూ విద్యార్థులు సోషల్ మీడియా ద్వారా మంచి కంటే ఎక్కువగా సమాజానికి అవసరం లేని వాటిని వీక్షించడానికి ఎక్కువ శాతం పిల్లలు ప్రయత్నిస్తున్నారన్నారు. పేద కుటుంబాల పిల్లలు బాగా చదివి మంచి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. అంతే కాకుండా విద్యార్థి దశలో సమయాన్ని వృధా చేయకుండా లక్ష్యం చేరుకునే గట్టి ప్రయత్నం చేస్తే భవిష్యత్తు సంతోషంగా ముందుకు సాగుతుందన్నారు. నేడు ప్రభుత్వం విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు,సౌకర్యాలు కల్పిస్తోందని వాటిని ఉపయోగించుకోవాలని కోరారు. అనంతరం మోటివేషన్ స్పెషలిస్ట్ రామ్మూర్తి మాటాడుతూ విద్యార్థులు మత్తుపదార్థాలకు అలవాటు పడకుండా దూరంగా ఉండాలన్నారు. మంచిగా చదువుకొని మీ తల్లితండ్రులకు మంచి పేరు తీసుకు రావాలని చెప్పారు. హైస్కూల్ ప్రధానోపాధ్యా యులు రఘు మాట్లాడుతూ విద్యార్థులందరు బాగా చదివి హైస్కూల్ కు మంచిపేరు తీసుకురావాలని అకాంక్షించారు. మీ తల్లి తండ్రులు మీ భవిష్యత్తు కోసం ఎంతో కష్టపడతున్నారని గుర్తు చేశారు. కావున ఈ విషయాన్ని అందరూ గుర్తించుకొని వారికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత మిరే తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అండ్ స్మైల్ డెంటల్ డాక్టర్స్ షాబియా షరఫ్,డాక్టర్ నేహా, డాక్టర్ రేచెన్,డాక్టర్ గౌతమీలు పాల్గొన్నారు

## కార్గిల్ అమరవీరులను దేశ ప్రజలు గుండెల్లో పెట్టుకున్నారు

- మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు కంచర్ల శ్రీనివాసులు నాయుడు




**మదనపల్లె,మేజర్‌న్యూస్ :** అమరవీరుల త్యాగానికి ప్రతీక కార్గిల్ విజయ్ దివస్ అని మదనపల్లి డివిజన్ మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు కంచర్ల శ్రీనివాసులు నాయుడు పేర్కొన్నారు. శనివారం కార్గిల్ విజయ్ దివస్ పురస్కరించుకొని పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జూలై 26వ తేదిన దాయాది దేశం పాకిస్తానుతోకార్గిల్ యుద్ధంలో సాధించిన విజయానికి చిహ్నంగా వీర సైనికుల అమర త్యాగాలకు చిహ్నంగా ఈరోజును విజయ్ దివస్ జరుపుకుంటామన్నారు. భారతదేశ స్వతంత్ర చరిత్ర ప్రతి పేజీ రక్తసిక్తం,వీరుల, వీరమాతల త్యాగాలకు గుర్తుగా భారతదేశానికి స్వతంత్రం సాధించబడింది. స్వతంత్రం వచ్చిన రోజు నుండి ఈరోజుటి వరకు దాయాది పాకిస్తాన్ దేశం, అడుగడుగునా భారతదేశానికి వ్యతిరేకంగా పనిచేస్తూనే ఉందన్నారు. ఉగ్రవాదం మూకలను తయారుచేసే కర్మాగారంగా పాకిస్తాన్ తయారైందన్నారు. అభివృద్ధిని మరిచి జిహాదీయుల పేరుతో ఉగ్రవాదులు జగదీస్తూ భారతదేశంపైకి ప్రతిరోజు ప్రతి గంట ప్రతి నిమిషం ఉసిగొలుపుతూనే ఉన్నది,భరతమాతవీరసైనికులుభారతదేశ సమగ్రతను,సార్వభౌ మాధికారాన్ని కాపాడడానికి అనునిత్యం ప్రాణాలను పణంగా పెట్టి సరి హద్దులకు కాపలాకాస్తున్నారన్నారు. ఈ పోరా టంలో ఎందరో వీరులు అశువులు బాశారని, ప్రాణాలను తృణప్రాయంగా ఎంచి ఒక్కొక్క వీరసైనికుడు భరత మాత రక్షణకు అకుంఠిత దీక్షతో పనిచేస్తూనే ఉన్నారన్నారు. అలాంటి వీరుల త్యాగాలను ప్రతి ఒక్కరుస్మరించుకోవడమేఈకార్గిల్ విజయ్ దివస్ ముఖ్యఉద్దేశ్యమన్నారు. మాజీ జవాన్లు, ప్రజలు ,రైతులుఅధికారులు,కార్మికులు, మహిళలు,ఆటో రిక్షా సోదరులు,చిరు వ్యాపారులు, విద్యార్థులు,కుల మతభేదాలులేకుండాపాల్గొనడం హర్షణీయమన్నారు

# కార్గిల్ అమరవీరులు భారతమాత ముద్దుబిడ్డలు

– ఘన నివాళులర్పించిన బీజేపీ నాయకులు




**మదనపల్లె,మేజర్‌న్యూస్ :** భారతమాత ముద్దు బిడ్డలు కార్గిల్ అమరవీరులని బిజెపి నాయకులు పేర్కొన్నారు.భారతీయ జనతా పార్టీ యువ మోర్చా జిల్లా అధ్యక్షులు మార్గాని వినోద్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో శనివారం ఆనాటి భారత ప్రధాన మంత్రి వాజపేయి సమర్థవంతమైన నాయకత్వం లో కార్గిల్ ద్వారా చొరబాటుకు ప్రయత్నించిన పాకిస్తాన్ దేశానికి గట్టిగా బుద్ధి చెప్పి ఎందరో సైనికులు ప్రాణత్యాగాల ఫలితంగా విజయం సాధించిన దినోత్సవాన్ని పురస్కరించుకొని అమం వీరుల త్యాగాలను కొనియాడుతూ స్థానిక మల్లికార్జున సర్కిల్ నందు నివాళులర్పించడం జరిగింది. అలాగే నేడు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో మరింత విస్తృతంగా పాకిస్తాను లోని ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసే స్థాయికి ఎదిగినందుకు భారతీయులుగా గర్విస్తున్నామని తెలిపారు.యువ మోర్చా జిల్లా అధ్యక్షులు వినోద్ కుమార్ యాదవ్ అధ్వర్యంలో ఎల్లంపల్లి ప్రశాంత్, పులి నరేంద్ర కుమార్ రెడ్డి,ఓసూరి కిరణ్ కుమార్, బండి ఆనంద్,పిల్లస్వామి నాయక్,మఠం కిరణ్ కుమార్,ఆర్‌ఎంపీ నాగరాజు,బర్నేపల్లి రవి కుమార్, పూల నాగరాజు,అజ్మతుల్లా ఖాన్,నారద రెడ్డి,శ్రీకాంత్,అఖిల్,కోసూరి భవానీలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ రక్షణ కోసం కార్గిల్ యుద్ధంలో విరోచితంగా పోరాడి,వీర మరణంపొందినఅమరజవానులకు నివాళులర్పిస్తున్నామన్నారు.కార్గిల్ యుద్ధం జరిగి నేటికి 26 ఏళ్ళ గడిచాయని గుర్తు చేశారు.ఇండియా – పాకిస్తాన్ మధ్య జరిగిన ఈ యుద్ధంలో భారత సైన్యం వీరోచిత పోరాటంతో 500 మందికిపైగా వీర మరణం పొందారన్నారు.కార్గిల్ విజయ్ దివస్ గా ప్రతీ ఏటాజూలై26నవీర సైనికులకు నివాళులర్పించడం భారతీయులుగా మనందరి కర్తవ్యమన్నారు.

# ఆంజనేయ స్వామి ఆలయాలలో తొలి శ్రావణ శనివారం పూజలు



**సంబేపల్లి మేజర్‌న్యూస్ :** మండల వ్యాప్తంగా ఆంజనేయ స్వామి ఆలయాలలో తొలి శ్రావణ శనివారం పూజలను భక్తులు చేపట్టారు. మండలం లోని శెట్టిపల్లి గ్రామం నరసారెడ్డి గారి పల్లె సమీపంలో పాల బండ వీరాంజనేయ స్వామి, ఆలయం గుట్టపల్లి వీరాంజనేయ స్వామి ఆలయం లో ప్రజలు విశేషంగా పాల్గొని పూజలు చేశారు. ఆలయాల్లో స్వామివారి సంకీర్తన భజన కార్యక్రమాలను నిర్వహిం చారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాలను చేపట్టారు .తొలి శ్రావణ శనివారం కావడంతో భక్తులు భక్తిశ్రద్ధలతో స్వామి వారిని దర్శించు కుని పూజలు చేశారు. ఈ మాసంలో ఐదు శనివారాలు ఆంజనేయ స్వామి ఆలయాల వద్ద శ్రావణశనివారం పూజలుఘనంగా నిర్వహిస్తు న్నట్లు ఆలయ నిర్వాహకులు తెలియజేశారు.

# సుపరిపాలనలో తొలిఅడుగు – ఇంటింటికి తెలుగుదేశం"





**సిద్ధవటం మేజర్‌న్యూస్ :** రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు రాజంపేట పార్లమెంటు అధ్యక్షులు చమర్తి జగన్మోహన్ రాజు ఆధ్వర్యంలో సిద్ధవటం మండలంలోని సంటి గారి పల్లె, వెలుగు పల్లె, గ్రామంలో శనివారం రోజున సుపరిపాలన లో తొలిఅడుగు ఇంటింటికి తెలుగు దేశం కార్యక్రమం విజయవంతంగా నిర్వహిం చబడింది మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మోహన్ రెడ్డి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన సంవ త్సరం కాలంలో కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన పథకాలను, ప్రజల సంక్షేమం–అభివృద్ధి కోసం చేపట్టిన ప్రతి కార్యక్రమం, భవి ష్యత్తులో చేపట్ట బోయే విదివిధా నాలను ఇంటి ఇంటికి వెళ్లి ప్రజలకు వివరించిప్రజలసమస్యలు తెలుసుకోవడం జరిగింది. ప్రజలు సంతోషంగా ఉన్నారని, ఇంటిలో ఎంతమంది చదువుకున్న పిల్లలు ఉన్న ప్రతి ఒక్కరికి'తల్లికివందనం'వచ్చిందనిప్రజలు తెలిపారు. సంవత్సరానికి, ప్రతి ఇంటికి మూడు గ్యాస్ సిలిండర్లు, ఆగస్టు నెలలో నుండి ప్రతి మహిళ ఉచిత బస్సు ప్రయాణము, రైతులకు అన్నదాత సుఖీభవా వంటి పథకాలను అమలు కాబోతున్నాయి అని ప్రజలకు వివరించారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు శనివారపు మోహన్ రెడ్డి, మండల క్లస్టర్ ఇంచార్జ్, దారపునేని దశరథ రామా నాయుడు, మాజీ నిత్య పూజ స్వామి దేవస్థానం చైర్మన్, ఎక్స్ సర్పంచి, ఎక్స్ ఎంపీటీసీ, జంగిటి రాజేంద్రప్రసాద్ యాదవ్, ఎక్స్ సర్పంచ్ వెంకటసుబ్బారెడ్డి, హరి ప్రసాద్, హరి, రవీంద్ర, బూసి వెంకటరామిరెడ్డి, బూసి వెంకటసుబ్బారెడ్డి, బూసి చిన్న సుబ్బారెడ్డి, బాబుల్ రెడ్డి, తదితరులు టిడిపి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సిపిఐ నిమ్మనపల్లి మండల కార్యదర్శిగా ఎన్.నరేష్ నియామకం

– ప్రజాసమస్యలపై పోరాటం చేస్తానని స్పష్టం



**మదనపల్లె రూరల్,మేజర్ న్యూస్ :** సిపిఐ నిమ్మనపల్లి మండల కమిటీ సమావేశం శనివారం మదనపల్లి పట్టణంలో స్థానిక ఎస్టియు కార్యాలయంలో జరిగింది.ఈ సమావేశానికి సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి కే.మురళి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సమావేశంలో నిమ్మనపల్లి మండల నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది.సిపిఐ నిమ్మనపల్లి మండల కార్యదర్శిగా ఎన్.నరేష్ ను ఏకీగ్రవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ నిమ్మనపల్లి మండలంలో ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తానని,పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా పని చేస్తానని స్పష్టం చేశారు.తనకు ఈ పదవి అప్పగించిన పార్టీ అధినాయకత్వానికి విప్లవ వందనాలు తెలియజేస్తున్నానన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ మదనపల్లి నియోజకవర్గ నాయకులు మాధవ్,రెడ్డి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానం చేయండి - ప్రాణదాతలుగా మారండి

– ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూధన్ పిలుపు



**మదనపల్లె,మేజర్‌న్యూస్ :** రక్తదానం చేశామంటే ఒకరికి ప్రాణదానం చేసిన దానితో సమానమని ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్ తెలిపారు. మత్తుకు బానిసైన ఐదుమంది రోగులను ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో శనివారం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు.ప్రభుత్వ ఆసుపత్రిలో డి అడిక్షన్ సెంటర్ నిర్వహిస్తున్న డాక్టర్ రాధిక వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు .చికిత్స నిమిత్తం వారిని ఆస్పత్రిలో చేర్పించారు.అనంతరం సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఇందులో భాగంగా ఎక్సైజ్ ఎస్ఐ జబీవుల్లా రక్తదానం చేశారు.ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మధుసూదన్ మాట్లాడుతూ మనం దానం చేసే ఒక్క యూనిట్ రక్తంఒకరిప్రాణాన్నినిలబెడుతుందన్నారు.ఇదిచాలామంచిసేవా కార్యక్రమమని,ప్రతి ఒక్కరూ ఇలాంటి సేవా కార్యక్రమాలను అలవర్చుకోవాలని తెలిపారు. ఇటీవల కాలంలో మత్తుకు బానిసై ఎన్నో కుటుంబాలు వీధిన పడుతున్నాయని,వారి కుటుంబాల్లో తిరిగి ఆనందం వెల్లివిరిసేలా బానిసైన వారిని గుర్తించివారినిడి అడిక్షన్ సెంటర్లో చేర్పించడం జరుగుతోందన్నారు. ఇలాంటి వారిని గుర్తించి ప్రతి ఒక్కరు వారికి కౌన్సిలింగ్ ఇచ్చే విధంగా ఆసుపత్రిలో చేర్పించితమవంతుకృషిచేయాలనిపిలుపునిచ్చారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ జోగేంద్ర,సిఐ భీమలింగ సిబ్బంది పాల్గొన్నారు.

## కలిసికట్టుగా పనిచేసి వైసీపీకి పూర్వవైభవం తీసుకొద్దాం

- మదనపల్లి వైకాపా సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ పిలుపు
- పార్టీ శ్రేణులకు అండగా ఉంటానని భరోసా



**మదనపల్లె టౌన్,మేజర్‌న్యూస్ :** పార్టీకి కార్యకర్తలే మూల స్తంభాలని, కావున పార్టీ కార్యక్రమాలలో క్రియాశీలకంగా పాల్గొన్నాలని మదనపల్లి వైకాపా సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ పిలుపునిచ్చారు.పార్టీ కార్యక్రమాలకు దూరంగా వున్న క్రియాశీలక నాయకులు,కార్యకర్తలతో నిస్సార్ అహమ్మద్ సమావేశమయ్యారు.నాడు జగన్మోహన్ రెడ్డి సిఎం కావాలని,వైసిపి అధికారం రావాలని మీరు చేసిన కృషి అమోఘమని ప్రశంసించారు. అధికారంలోకి వచ్చిన తగిన గుర్తింపు లేకపోవడం దురదృష్టకరమన్నారు. ఇకపై అలాంటి పరిస్థితి వుండదని,మళ్ళీ మనం అధికారంలోకి రావడం ఖాయమని తెలిపారు.జగన్ 2.0లో కార్యకర్తలకే అగ్రస్థానం,మీరు పార్టీ కార్యక్రమాలకు దూరంగా వుండటం ఎంతో బాధ కలిగించిందన్నారు.తిరిగి పార్టీలో క్రియా శీలకంగా పని చేయాలని,మీకు తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఇందులో భాగంగా గతంలో పార్టీ కోసం ఉత్సాహంగా పనిచేసిన ఫక్రూ,షేక్ మన్సూర్,నారాయణ రెడ్డి,నగేష్ రెడ్డి,సత్తార్,జైను సాహెబ్,సాదిక్,జబి, సుబ్బారెడ్డి,శంకర రెడ్డి,వేణు,రెడ్డి శేఖర్,భాస్కర్,షబ్బీర్, రహమతుల్లాలతో మాట్లాడారు.వారి ఆవేదనకు కారణాలు తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు

# రేపు బడికాయలపల్లిలో బాబు షూరిటీ – మోసం గ్యారంటీ

– జయప్రదం చేయాలని ప్రదీప్ రెడ్డి,రెడ్డిహరిల పిలుపు

**బి.కొత్తకోట,మేజర్‌న్యూస్ :** తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని బడికాయలపల్లి పంచాయతీ,సూరపువారి పల్లి మారెమ్మ గుడి వద్ద ఈనెల 28వ తేదీ అనగా సోమవారం బి.కొత్తకోట మండలం వైఎస్ఆర్సిపి గ్రామస్థాయి విస్తృత సమావేశం,బాబు షూరిటీ మోసం – గ్యారెంటీ మరియు రీకాలింగ్ బాబుస్ మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్ఆర్సిపి మండల అధ్యక్షుడు ప్రదీప్ రెడ్డి,తంబళ్లపల్లి నియోజకవర్గం బూత్ కమిటీ అధ్యక్షుడు నేరెళ్ల రెడ్డిహరిలు పేర్కొన్నారు.ఈ సందర్భంగా శనివారం వారు మాట్లాడుతూ కూటమి వైఫల్యాలు,సూపర్ సిక్స్ హామీల అమలులో ప్రజలను మోసం చేయడం వంటి అంశాలపై ఈ కార్యక్రమంలో చర్చించడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమానికి జడ్పిటిసి, ఎంపీపీ,వైస్ ఎంపీపీ,వైఎస్ఆర్సిపి మండల అధ్యక్షుడు,ఉపాధ్యక్షులు, సర్పంచులు,ఉప సర్పంచులు ఎంపీటీసీలు మండల కమిటీ కార్యవర్గ సభ్యులు,జిల్లా, నియోజకవర్గ,మండల,గ్రామ పార్టీ వివిధ అనుబంధ సంఘాల అధ్యక్షులు, కమిటీ సభ్యులు,గ్రామ అధ్యక్షులు,వైఎస్ఆర్సిపి నాయకులు,కార్యకర్తలు ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు.





## ప్రజలతో మమేకమవుతున్న టిడిపి నాయకులు

- జన్మభూమి కాలనీలో సుపరిపాలన తొలిఅడుగు
- హాజరైన టిడిపి రాష్ట్ర మైనార్టీ ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం రఫీ



**మదనపల్లె టౌన్,మేజర్ న్యూస్ :** మదనపల్లి శాసనభ్యులు షాజహాన్ బాషా ఆదేశాల మేరకు బసినికొండ -1 పంచాయతీ జన్మభూమి కాలనీలో సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు.శనివారం టిడిపి రాష్ట్ర మైనార్టీ ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం.రఫీ,ఎస్సీ సెల్ అధ్యక్షులు చుక్క విజయ కుమార్,గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ తౌఫిక్,కార్యదర్శి షమీల్ అహ్మద్,గౌస్ బాషా,సబీర్ అహ్మద్,మహమ్మద్ తాకిర్ తదితరులు కాలనీ ప్రజలతో మమేకమై ఏడాది జరిగిన అభివృద్ధి, ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పం చిపెట్టారు.అలాగే కాలనీ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం ద్వారా అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందు తున్నాయా లేదా అరా తీశారు. అర్హత ఉండి రాకపోతే న్యాయం చేస్తామని హామీఇచ్చారు. ఈకార్యక్రమంలో స్థానిక నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం



**బి.కొత్తకోట, మేజర్న్యూస్ :** బి.కొత్తకోట మండలం తుమ్మనంగుట్ట టోల్గేట్ సమీపంలోనిజాతీయ రహదారి 42 పై డివైడర్ కు వాహనం ఢీకొని ప్రమాద స్థలంలోని ఇద్దరు యువకులు మృతి చెందారు.మృతిచెందిన వారు కుప్పం మండలంఅనిమిగానిపల్లెకుచెందినలోకేష్(20)కాకిమడుగుగ్రామానికి చెందిన వెంకటేష్ (35)గా గుర్తించారు.వీరిద్దరూ మదనపల్లెలోని ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో ఉద్యోగరీత్యా ములకలచెరువుకు కలెక్షన్ కు వెళ్లి తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో ప్రమాదం ఇప్పుడు చేసుకుంది. హుటాహుటిన ఘటనా స్థలానికిబి.కొత్తకోటపోలీసులుచేరుకునిప్రమాదఘటనపై విచారణ చేపట్టారు.

## అధికారులు సమస్యలపై దృష్టి పెట్టండి

ఎంపీడీవో హరి నారాయణ

**ములకలచెరువు, మేజర్న్యూస్ :** ములకలచెరువు మండలంలోని సమస్యలపై అధికార యంత్రాంగం దృష్టి సారించాలని ఎంపీడీవో హరి నారాయణ ఆదేశించారు. శనివారం మండల అభివృద్ధి కార్యాలయంలో ఎంపీపీసాయిలీల అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో తాగునీటి కాలుష్యం, పారిశుద్ధ్య లోపం లేకుండా చూడాలని సూచించారు. మండలంలో తాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి చేశామని ఎక్కడైనా సమస్యలు తలెత్తితే తమ దృష్టికి తేవాలన్నారు.మారుమూల గ్రామాలలో ముందస్తుగా తాగునీటి ట్యాంకులు శుభ్రం తో పాటు పారిశుధ్యం పై అవగాహన, ముందస్తుగా వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తల సహకారంతో ఆరోగ్య సూత్రాల పై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు.ఈ మండల సర్వసభ్య సమావేశంలో మండల స్థాయి అధికారులు, మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది మరియు కూటమి నాయకులు పాల్గొన్నారు.




## అక్రమ కేసుల నుండి ఎంపీ మిథున్ రెడ్డి త్వరగా విడుదల అవ్వాలి

- ఎంపీపీ వేంపల్లి నూర్జహాన్



**కలికిరి మేజర్ న్యూస్:** అక్రమ కేసుల నుండి ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి తొందరగా విడుదల అవ్వాలని ఎంపీపీ నూర్జహాన్ ఆశాభావం వ్యక్తం చేశారు. శనివారం మైనార్టీ పెద్దల ఆధ్వర్యంలో పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి అక్రమ అరెస్టును చేదించుకుని, కడిగిన ముత్యంలా, ఆయురారోగ్యాలతో కేసు నుండి తొందరగా బయట పడాలని సదుద్దేశంతో దువా చేయడం జరిగిందని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వైసిపి నాయకుల పైన కక్ష కట్టి అక్రమ అరెస్టులు చేస్తున్నారని, అందుకు కోర్టు లే నిజం తేల్చి వైసిపి నాయకులను విడుదల చేస్తాయని ఆశా భావం వ్యక్తం చేశారు.ఈకార్యక్రమంలో మండల వైస్ ప్రెసిడెంట్ వేంపల్లి బావాజీ, యూత్ లీడర్ వేంపల్లి ఫయాజ్, మండల మైనార్టీ అధ్యక్షుడు ఖాదర్ భాషా, మండల దూదేకుల ప్రెసిడెంట్ నజీర్, వార్డ్ మెంబర్ సైదు, అమన్, వాహీద్, షౌకత్, రెడ్డి భాషా, జాకీర్, నిసార్, షబ్బీర్, అఫ్రుద్దీన్ వలి, రషీద్, పాల్గొన్నారు

## పేదరిక నిర్మూలనకే [పీ4] బంగారు కుటుంబాల ఎంపిక

- కురవంక సర్పంచ్ పసుపులేటి చలపతి వెల్లడి
- హాజరైన ప్రత్యేక అధికారి సుబ్రమణ్యం



**మదనపల్లె రూరల్,మేజర్ న్యూస్ :** పేదరికం నిర్మూలించేందుకు బంగారు కుటుంబాలను (పీ4) గుర్తిస్తున్నట్లు కురువంక సర్పంచ్ పసుపులేటి చలపతి తెలిపారు.పీ4 కార్యక్రమం ద్వారా బంగారు కుటుంబాలు,మార్గదర్శకాలను గుర్తించేలా శనివారం కురవంక గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ అధ్యక్షతన సమావేశం జరిగింది.ఈ సమావేశానికి స్పెషల్ ఆఫీసర్,మండల సర్వేయర్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ పసుపులేటి చలపతి మాట్లాడుతూ గ్రామపంచాయతీలో బంగారు కుటుంబాలు ఎన్ని ఉన్నాయి,ఎంతమంది అర్హత కలిగి ఉన్నారో గుర్తించాలన్నారు.గుర్తించిన కుటుంబాలను ఆన్ లైనులో నమోదు చేయాలన్నారు.బంగారు కుటుంబం - మార్గదర్శి (పీ4) కార్యక్రమాన్ని కురవంక గ్రామ పంచాయతీలో సమర్థవంతంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం కూడా ఎక్కడ పేదరికం ఉండకూడదన్న లక్ష్యంతో నిరుపేద కుటుంబాలను దత్తత తీసుకునే వారిని ఆర్థికంగా అభివృద్ధి చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.ఆగస్టు 15 నాటికి బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేవారు ముందుకు వస్తున్నట్లు చెప్పారు.ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శి మణి కుమార్,ఉప సర్పంచ్ నాగరాజ,వార్డు మెంబర్స్,సిబ్బంది పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన కల్పించిన ఎస్సై సుధాకర్



**చిన్నమండెం మేజర్ న్యూస్ :** మండలములోని ప్రాథమికోన్నత పాఠశాల యందు శనివారం ఎస్సై విద్యార్థినులను ఉద్దేశించి సమాజంలో జరుగుతున్న సైబర్ నేరుగాలపై ట్రాఫిక్ రూల్స్ పై హెల్మెట్ లేకపోతే ఎలాంటి ప్రమాదాలు జరుగుతాయి మహిళలు పట్టా జరుగుతున్న అత్యాచారాలు లాంటి వాటిపై ఎస్సై సుధాకర్ అవగాహన సదస్సు నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థినిలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

## విక్టర్ హోమ్ అప్లైయన్స్ షాప్ ను ప్రారంభించిన చమర్తి



**రాజంపేట,మేజర్ న్యూస్ :** రాజంపేట టౌన్ పాత బస్టాండ్ దగ్గర విక్టర్ హోమ్ అప్లైయన్స్ షాప్ యజమాన్యం ఆహ్వానం మేరకు విక్టర్ హోమ్ అప్లియన్స్‌ను రాజంపేట టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్ రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా చమర్తికి విక్టర్ హోమ్ అప్లయన్స్ యజమాన్యం ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజంపేట పట్టణం నందు ప్రజలకు నాణ్యమైన క్వాలిటీ వస్తువులను అందు బాటులో పెట్టడం సరసమైన ధరలకే అందించగలరని కోరడమైనది.మంచి వ్యాపారం కొనసాగిస్తూ రాజంపేట ప్రజలకు మంచి సేవలు అందించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు షాపు యజమాన్యం వారిఅభిమానులు పాల్గొనడం జరిగినది.





## బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ 27 నుండి రాష్ట్ర పర్యటన

**ఒంటిమిట్ట,మేజర్ న్యూస్ :** సారథ్యం పేరుతో రాష్ట్ర పర్యటనపోతుగుంట రమేష్ నాయుడుఅన్నమయ్య జిల్లా ఒంటిమిట్ట లోని బిజెపి కార్యాలయంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నంద్యాల జిల్లా ఇంచార్జ్ పోతుగుంట రమేష్ నాయుడు మాట్లాడుతూ ఈనెల 27 నుండి బిజెపి రాష్ట్ర అధ్యక్షులు శ్రీ పివిఎన్ మాధవ్ గారి పర్యటన సారథ్యం పేరుతో తొలి గడప కడప నుండి ప్రారంభమవుతుందని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వికసిద్భారత్ లక్ష్యం కోసం సారదులుగా కార్యకర్తలను తీర్చిదిద్దేందుకు ఈ పర్యటన ఉంటుందని అలాగే ప్రతి గడపకు బిజెపి జెండాను మరియు అజెండాను తీసుకుపోయే కార్యక్రమం కార్యకర్తలను కారుణ్యముకులను చేయడానికి ఈ పర్యటన ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. రోజుకు ఒక జిల్లా చొప్పున పూర్తిస్థాయి పర్యటన చేస్తున్నారని వారు అన్నారు ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు భాను ప్రకాష్ రాజు, బిజెపి మాజీ మండల అధ్యక్షులు బాలరాజుశివరాజు,ఒంటిమిట్టచెరువుఅధ్యక్షులు గంగిరెడ్డి , బిజెపి నాయకులు వెంకటసుబ్బారెడ్డి ,మండల ప్రధాన కార్యదర్శి జగదీష్ పాల్గొన్నారు.

